# సివిల్స్ ప్రిలిమ్స్.. మెళకువలు

**సీశాట్ (సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్).. దేశవ్యాప్తంగా కొన్ని లక్షల మందికి టార్గెట్. పీహెచ్‌డీ స్కాలర్ మొదలు.. ఫ్రెష్ గ్రాడ్యుయేట్ వరకు దాదాపు ప్రతి ఒక్కరూ 'ఒక్క ఛాన్స్' అంటూ సిద్ధమయ్యే పరీక్ష సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషనే! ఈ ఏడాది కూడా సీశాట్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. మరో రెండు వారాల్లో మే 20న నిర్వహించనున్న పరీక్షకు యూపీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో సబ్జెక్ట్ నిపుణులు, గత విజేతలు అందిస్తున్న సివిల్స్ ప్రిలిమ్స్ సక్సెస్ ప్లాన్...**

దేశ వ్యాప్తంగా లక్షలమంది, మన రాష్ట్రం నుంచి పదివేలకుపైగా హాజరయ్యే పరీక్ష సీశాట్ (సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్). దీనికి ప్రధాన కారణం.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర కేంద్ర సర్వీసుల్లో కొలువుకు తొలి అడుగులు పడేది ఇక్కడే. ఈ అడుగులు తడబడకుండా.. గెలుపు గమ్యం దిశగా మలి మైలురాయి మెయిన్స్ ఎగ్జామినేషన్ దశకు చేరుకోవాలంటే...

SAKSHI

## రివిజన్.. రివిజన్.. రివిజన్:

రివిజన్.. రివిజన్.. రివిజన్! ప్రస్తుత సమయంలో అభ్యర్థులు పఠించాల్సిన సూత్రమిదే. వాస్తవానికి సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్న సీరియస్ యాస్పిరెంట్స్ ఈపాటికి తమ ప్రిపరేషన్ పూర్తి చేసుకుని ఉంటారు. ఈ దశలో వారి విజయావకాశాలను మరింత మెరుగుపరిచే సాధనం రివిజన్ మంత్రమే. ఈ రెండు వారాల సమయంలో కొత్త అంశాల జోలికి వెళ్లకుండా.. ఇప్పటికే చదివిన అంశాలను రివిజన్ చేసుకోవడమే ఉత్తమం. సీనియర్ అభ్యర్థులు ఈ విషయంలో కొంత అవగాహన ఉంటుంది. కానీ తొలిసారి రాస్తున్న అభ్యర్థులు 'ఇంకా చదివితే మరిన్ని అంశాలపై పరిజ్ఞానం లభిస్తుంది. మరిన్ని మార్కులు సొంతం చేసుకోవడానికి మార్గం ఏర్పడుతుంది' అని భావిస్తారు. కానీ ఇది సరికాదు. కొత్త అంశాలవైపు దృష్టి సారించి అర్థంకాని వాటి గురించి ఆందోళన చెందడం కంటే ఇప్పటికే పట్టున్న అంశాలపై మరింత అవగాహన పొందడం వల్ల మరింత మేలు జరుగుతుందని నిపుణుల అభిప్రాయం.

## ఎంతో కీలకం.. ఎకానమీ:

ప్రిలిమ్స్ పేపర్-1 గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ఎకానమీ సంబంధిత అంశాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. సాధారణంగా అభ్యర్థులు 'ఎకానమీ పరిధిలోనివి' అని భావించే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటికి సంబంధించిన నేపథ్యం.. అంటే.. సదరు పథకంపై ప్రభుత్వ విధానాలు, ఆ విధాన రూపకల్పనకు కారణాలు, లక్షిత వర్గాలు, ఆ పథకాల ప్రస్తుత అమలు తీరు, విజయాలు, వైఫల్యాలు తదితర అన్ని

కోణాల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. మొత్తం ప్రశ్నల్లో 50 శాతం వరకు ఇలాంటి ప్రశ్నలే ఉంటున్నాయి. వాస్తవానికి చాలామంది అభ్యర్థులు ఎకానమీ అంటే ఆయా పథకాలు, గణాంకాల సేకరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీన్ని విడనాడాలి. ఇప్పటికైనా ఈ రెండు వారాల వ్యవధిలో ఆయా పథకాల నేపథ్యంపై అవగాహన పెంచుకోవాలి. సమకాలీనంగా చోటు చేసుకున్న మార్పుల గురించి తెలుసుకోవాలి.

## పర్యావరణంపై పట్టు.. విజయానికి మెట్టు:

సివిల్స్ ప్రిలిమ్స్ పేపర్-1లో విజయానికి కీలక మెట్టుగా మారుతున్న అంశం 'పర్యావరణం'. ఈ అంశం నుంచి కూడా రెండు కోణాల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. అవి.. కాన్సెప్ప్చువల్, ఫ్యాక్ట్ ఓరియెంటెడ్. కాన్సెప్ప్చువల్ దృక్పథంలో ఏదైనా నిర్దిష్ట సమస్యకు సంబంధించి అన్ని కోణాలను స్పృశించేలా ప్రశ్నలు అడుగుతుండగా.. ఫ్యాక్ట్ ఓరియెంటెడ్ దృక్పథంలో పర్యావరణ అంశాలకు సంబంధించి ఇటీవల సదస్సులు, సమావేశాలు, నియామకాలు వంటి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో 'పర్యావరణ కాలుష్యం' చర్చనీయాంశమైన నేపథ్యంలో దీనిపై మరింత దృష్టి సారించాలి.

## కరెంట్ ఇష్యూస్‌పై దృష్టి:

యూపీఎస్సీ ప్రశ్నల సరళి ద్వారా తెలుస్తున్న మరో విషయం కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెరుగుతుండటం. మొత్తం ప్రశ్నల్లో 60 నుంచి 70 శాతం కరెంట్ ఇష్యూస్‌కి సంబంధించినవే. ఈవిషయంలో కూడా యూపీఎస్సీ వైవిధ్యంగా కదులుతోంది. సాధారణంగా 'కరెంట్ అఫైర్స్ అంటే పరీక్ష ముందు ఏడాది కాలంలో జరిగిన పరిణామాలే' అనేది అభ్యర్థులు అభిప్రాయం. కానీ అవే పరిణామాలను వాటి నేపథ్యాలతో అనుసంధానం చేస్తేతప్ప సమాధానం ఇవ్వలేని విధంగా ప్రశ్నలు అడుగుతోంది యూపీఎస్సీ. ఉదాహరణకు: ప్రాథమిక నిర్బంధ విద్యా హక్కు అమలు దిశగా ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోర్టు తీర్పు వెల్లడైంది. సాధారణంగా కోర్టు తీర్పు వెల్లడైన తేదీ, లేదా తీర్పు వెల్లడించిన బెంచ్, ప్రాథమిక విద్యా హక్కు అంటే ఏంటి? అనే అంశాలపై అవగాహన చాలనుకుంటారు. కానీ ఇదే అంశాన్ని ఎగ్జామినర్ కోణంలో చూడాలి. తీర్పు పర్యవసానాలు ఏంటి? ప్రైవేటు సంస్థలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? ఈ హక్కు రూపకల్పనకు కారణాలేంటి? ఇలా పలు కోణాల్లో ప్రశ్న అడగొచ్చు.

అదేవిధంగా ఇటీవల ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఉత్తర, దక్షిణ సుడాన్ సమస్యను పరిశీలిస్తే అభ్యర్థులు దక్షిణ సుడాన్ ఏర్పాటు తేదీ? ఎన్నో దేశం? ఎన్నేళ్ల తర్వాత విడిపోయింది? వంటి ప్రాథమిక అంశాలకు పరిమితం అవుతారు. కానీ ఎగ్జామినర్ కోణంలో చూస్తే.. 'అసలు ఈ రెండు ప్రాంతాల మధ్య వివాదాలకు కారణమేంటి? ఈ విషయంలో చమురు నిల్వలు, నైలు నది పరీవాహక ప్రాంతాలు ఏంటి? అనే పలు కోణాల్లో ప్రశ్నలు అడగొచ్చు.

ఇప్పటివరకు ఇలా గ్రౌండ్ లెవల్ రీజన్స్‌ను తరచిచూడని అభ్యర్థులు ఈ రెండు వారాల్లో వాటిపై దృష్టి సారించాలి. ఇప్పటికే ఆయా సమకాలీన అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం సొంతమై ఉంటుంది కాబట్టి వాటి నేపథ్యం గురించి తెలుసుకోవడానికి పెద్ద సమయం పట్టదు.

హిస్టరీ విషయంలో యూపీఎస్సీ ప్రశ్నల సరళి మారుతున్న నేపథ్యంలో ఆధునిక భారతదేశ చరిత్రకు ప్రాధాన్యం పెరుగుతోంది. దీనిపై ఎక్కువ సమయం కేటాయించడం ఉత్తమం.

పాలిటీలో కూడా పలు కోణాల్లో ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కోర్ పాలిటీకి ప్రాధాన్య తగ్గి కాంటెంపరరీ అంశాల అనుసంధానంతో అడిగే ప్రశ్నలు పెరుగుతున్నాయి. కాబట్టి తాజా రాజ్యాంగ సవరణలు, కారణాలు, వాటి వల్ల ఆశించే ఫలితాలు, పర్యవసానాలపై పట్టు సాధించి అడుగులు వేయాలి.

## పేపర్-2 అధిక స్కోరింగ్ దిశగా అడుగులు:

తార్కిక విశ్లేషణ, నిర్ణయాలు తీసుకునే శక్తి, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరీక్షించే పేపర్-2లో అధిక శాతం మార్కుల సాధనకు ప్రయత్నించాలి. 'పేపర్-1లో నెగెటివ్ మార్కిం గ్ ఉన్న నేపథ్యంలో పేపర్-2లో ఎక్కువ మార్కులు పొందేందుకు కృషి చేయాలి.' అని నిపుణుల సలహా.

పేపర్-2లో ముఖ్యమైన అంశం.. భేదాభిప్రాయాలకు తావిచ్చే అంశం డెసిషన్ మేకింగ్. ఒక నిర్దిష్ట సందర్భం, లేదా సమస్య ఎదురైన నేపథ్యంలో ఒక ప్రభుత్వ అధికారిగా ఎలాంటి నిర్ణయం తీసుకుం టారు? అనే కోణంలో ప్రశ్నలు అడుగుతారు. వీటికి సమాధానం ఇచ్చే విషయంలో కొన్ని సూచనలు..

- అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లలో రాజ్యాంగబద్ధంగా ఉన్న దాన్ని గుర్తించాలి.
- ప్రభుత్వ విధానాల కోణంలో ఆలోచించాలి.
- అధిక శాతం మందికి ప్రయోజనం చేకూర్చేవిధంగా ఉన్న ఆప్షన్‌ను గుర్తించాలి.
- ప్రతికూల నిర్ణయాలున్న ఆప్షన్ల జోలికి వెళ్లకూడదు.

పేపర్-2లోనే మరో ముఖ్యమైన విభాగం 'ఇంటర్ పర్సనల్ స్కిల్స్'. ఒక నిర్దిష్ట సమస్యతో వచ్చే వ్యక్తితో ఒక ప్రభుత్వ అధికారిగా ఎలా ప్రవర్తిస్తారు? అనే విధమైన ప్రశ్నలు అడుగుతారు.

ఈ అంశాలకు నిర్దిష్ట సిలబస్, ప్రామాణిక పుస్తకాలు వంటివి ఉండవు. అభ్యర్థులు తమ సమయస్ఫూర్తి ప్రదర్శించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి డెసిషన్ మేకింగ్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్‌కు సంబం ధించిన ప్రశ్నల విషయంలో సానుకూల ఫలితాన్ని ప్రతిబింబించే ఆప్షన్‌ను గుర్తించే విధంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలి.

## ఇంగ్లిష్:

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీలో పేపర్-2లో ఆప్షనల్ స్థానంలో ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రారంభించిన నేపథ్యంలో.. ముఖ్యమైన విభాగం.. కోర్టు దాకా వెళ్లిన విభాగం ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్. ఈ ఇంగ్లిష్

లాంగ్వేజ్ స్కిల్స్ విషయంలో ప్రధానంగా గ్రామీణ అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారనేది నిస్సందేహం. అయితే కొద్దిపాటి జాగ్రత్తలతో ఈ సమస్యను అధిగమించొచ్చు. అవి..

- ✔ పదాల అమరికపై అవగాహన
- ✔ వాక్యాలను వేగంగా చదివే నైపుణ్యం
- ✔ వొక్యాబులరీ పెంచుకోవడం.

వీటికోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్ చదవడం లాభిస్తుంది. అదేవిధంగా ఇంగ్లిష్ సిలబస్‌గా ఉన్న బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ప్రయోజనం.

## నెగెటివ్ మార్కింగ్.. బీ కేర్‌ఫుల్:

యూపీఎస్సీ సీశాట్‌లో నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. కాబట్టి అభ్యర్థులు సమాధానాలు ఇచ్చే క్రమంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కచ్చితంగా 50 శాతం ప్రశ్నలకు సమాధానం ఇచ్చే పరిజ్ఞానంతో పరీక్ష హాల్లో అడుగు పెట్టాలి. అలా కచ్చితం అనుకున్న ప్రశ్నలకు సమాధానం ఇచ్చాకే గెస్సింగ్ చేయాలి. ఈ గెస్సింగ్ కూడా వ్యూహాత్మకంగా ఉండాలి. ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో 'రెండు ఆప్షన్లు తప్పు' అని కచ్చితమైన అవగాహన ఉంటేనే గెస్సింగ్ ఉపయోగపడుతుంది. లేదంటే నెగెటివ్ జోన్‌లోకి వెళ్లడం ఖాయం.

## దృష్టి సారించాల్సిన అంశాలు:

- ✔ భారత్ – పాక్ సంబంధాలు: తాజా పరిణామాలు
- ✔ భారత క్షిపణి వ్యవస్థ అభివృద్ధి
- ✔ అవినీతి నిరోధం– ప్రభుత్వ తాజా చర్యలు
- ✔ పౌర నాయకత్వం, రక్షణ నాయకత్వం మధ్య సంబంధాలు
- ✔ బయో డైవర్సిటీ జనాభా గణాంకాలు
- ✔ సుడాన్ సంక్షోభం భారత నీటి, అణు వనరులు
- ✔ భారత విపత్తు నిర్వహణ– సన్నద్ధత
- ✔ సునామీ సంభవ ప్రక్రియ– తాజా సంఘటనలు
- ✔ హిమాలయాల్లో జల విద్యుదుత్పత్తి

## డూ ఆర్ డై.. ప్రిపరేషన్‌లోనే.. పరీక్ష హాల్లో కాదు

సివిల్స్ పరీక్షను డూ ఆర్ డై గా భావించే అభ్యర్థులు ఆ దృక్పథాన్ని ప్రిపరేషన్‌కే పరిమితం చేయాలి. పరీక్ష హాల్లో కూడా 'డూ ఆర్ డై' అనే ఆలోచనతో ఉంటే ఒత్తిడికి లోనవడం ఖాయం. దీనివల్ల ప్రతికూల ఫలితమే తప్ప ప్రయోజనం ఉండదు. సెల్ఫ్ నోట్స్ రూపొందించుకుంటే దాని ద్వారా రివిజన్ చేయడం వల్ల సమయం కలిసొస్తుంది. నెగెటివ్ మార్కింగ్ ఉంది కాబట్టి... మొదటిసారి రాసే అభ్యర్థులు గెస్సింగ్‌కు

అతిస్వల్ప ప్రాధాన్యం ఇవ్వాలి. తెలియని ప్రశ్నల గురించి ఆందోళన చెందకుండా కచ్చితత్వంతో సమాధానాలు ఇవ్వగలిగే ప్రశ్నలపై దృష్టి పెట్టాలి.

**– గురజాల శ్రీనివాసరావు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్**

## బలహీన అంశాలపై దృష్టి

చివరి ఛాన్స్‌గా సివిల్స్ ప్రిలిమ్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులు ఇప్పటికీ తాము బలహీనంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలి. ఇదే సమయంలో వాటి కోసం అధిక సమయం కేటాయించి విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దు. ఆ అంశాల ప్రాథమిక సమాచారాన్నయినా పొందే విధంగా సన్నద్ధత సాధించాలి. ఇక మొదటిసారి రాసే అభ్యర్థులకు 'మరో ఛాన్స్ ఉంది కదా' అనే ఆలోచన సరికాదు. కటాఫ్ విషయంలో రెండు పేపర్లకు కలిపి కామన్ కటాఫ్ అని యూపీఎస్సీ స్పష్టం చేసింది. కాబట్టి రెండు పేపర్లకు కలిపి 240 మార్కులు పొందే విధంగా సన్నద్ధులై పరీక్ష హాల్లో అడుగుపెట్టాలి.

**– వి. గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ అకాడెమీ**

## ఆత్మవిశ్వాసమే అసలు ఆయుధం

సివిల్స్ విజయంలో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు కీలకపాత్ర పోషించేది ఆత్మవిశ్వాసం. ఒత్తిడికి లోనవకుండా 'నేను రాయగలను' అనే విశ్వాసంతో కదలాలి. ఈ రెండు వారాల సమయంలో రివిజన్‌కు ప్రాధాన్యమివ్వాలి. ప్రశ్నల్లో ఇన్‌డైరెక్ట్ ప్రశ్నల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. కాబట్టి ఒక అంశానికి సంబంధించి విభిన్న కోణాల్లో సమాచార సేకరణ ఉపకరిస్తుంది. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ఎకానమీ సంబంధిత అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. ఈ సమయంలో గ్రూప్ స్టడీ లేదా నైట్ అవుట్ స్టడీస్ అనుసరణీయం కాదు. నైట్ అవుట్ స్టడీస్ అలవాటు ఉన్న అభ్యర్థులు ఈ రెండు వారాల్ల తమ దినచర్య క్రమాన్ని మార్చుకోవాలి. నెగెటివ్ మార్కింగ్ ఉన్న నేపథ్యంలో కచ్చితత్వం, గెస్సింగ్ రెండు రకాలుగా 70 శాతం ప్రశ్నలు పూర్తి చేస్తే.. ఆపై మరింత గెస్సింగ్ అనవసరం అని గుర్తించాలి. దాదాపు రెండేళ్ల అహర్నిశలు చేసిన కృషిని రెండున్నర గంటల్లో ప్రతిబింబించాలి. కాబట్టి ఒత్తిడి లేకుండా పరీక్ష హాల్లో అడుగుపెట్టాలి.

చెవ్వూరు హరికిరణ్, ఐఏఎస్,
(18వ ర్యాంకు. సివిల్స్–2009, ఏపీ టాపర్),
సబ్ కలెక్టర్, మదనపల్లి.